క్లుప్తంగా

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం



గద్వాల: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ వైఫల్యాలను నిరసిస్తూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పాని, ప్రభుత్వం వాటి ఊసే మర్చిపోయిందన్నారు. ఎనిమిది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని విమర్శించారు. అనంతరం అధికారి శివకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా నాయకులు బండల పద్మావతి, రజక జయశ్రీ, వెంకటమ్మ, లక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

నేడు చలో కలెక్టరేట్



గద్వాల అర్బన్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మధు, తిమ్మప్ప, నర్సింహులు, సవారన్న, హనుమంతు ఉన్నారు.

ఘనంగా వివేకానంద వర్ధంతి



ఉండవెల్లి: మండల కేంద్రంలో 122వ వివేకానంద వర్ధంతిని ఆదర్శ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్వామి వివేకానంద భారత దేశంలో యువతకు దిశా నిర్దేశం చేశారని, 39 ఏళ్ల వయస్సులోనే మరణించిన ఆయన జ్ఞాపకాలు చెరిగిపోనివని కొనియాడారు. కార్యక్రమంలో ఆదర్శ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణ, నర్సప్ప, ప్రభాకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రైతు సంఘం సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని కోయిల్ దిన్నె గ్రామంలోని పశువులకు శాంతినగర్ పశువైద్యశాల ఆధ్వర్యంలో గురువారం లంపిస్కిన్ టీకాలు వేశారు. వానాకాలంలో పశువులకు వివిధ రకాల వ్యాధులు సోకుతాయని, యజమానులు ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. ఈ సందర్భంగా 128 ఆవులు, ఎద్దులుకు టీకాలు వేసినట్లు డాక్టర్ పుష్పలత తెలిపారు. కార్యక్రమంలో వరప్రసాద్, లతీఫ్, రవి, వెంకటమ్మ, కృష్ణలు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు



మానవపాడు: రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఎరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు సహకార సంఘం నందు తీసుకోని వెళ్లాలని కోరారు. యూరియా, డీఏపీ, 20–20–0–13 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షులు అయ్యన్న, మాజీ కార్యదర్శి మద్దిలేటి, రైతులు శాంతన్న తదితరులు ఉన్నారు.

పాఠశాల పరిశీలన



రాజోళి: మండల కేంద్రంలో ఉన్న జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నిషాక్ పాఠశాల సిబ్బందికి విజ్ఞప్తి చేశారు. పాఠశాలలో నూతనంగా బాధ్యతలు తీసుకున్న ప్రధానోపాధ్యాయుడు భగీరథరెడ్డితో పాటు సిబ్బందిని ఆయన కలిశారు. అనంతరం పాఠశాలలో నెలకొన్న సమస్యలను వారికి చూపించారు. కార్యక్రమంలో చేనేత శ్రామిక సేవా సమితి సభ్యుడు వీరేష్, రామకృష్ణ ఉన్నారు.

సమస్యల వలయంలో కస్తూర్బా

- పాఠశాలలో 268 మంది విద్యార్థినులు
- ప్రభుత్వం నుంచి 200 మందికే అందుతున్న వసతులు
- ప్రతి విద్యార్థికి రోజుకు రూ.34 చెల్లింపు
- డార్మిటరీలలో బసకు నిత్యం తిప్పలు
- పట్టించుకోని అధికారులు



ఎర్రవల్లి కస్తూర్బా పాఠశాల భవనం

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పుట్టెడు సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గతంలో జాతీయ రహదారి కోసం పాఠశాల సమీపంలో మట్టిని తవ్విన కోరి గుంత విద్యార్థుల పాలిట శాపంగా మారింది. పాఠశాలలో మొత్తం 268 మంది విద్యార్థులు ఉండగా ప్రభుత్వం నుంచి కేవలం 200 మంది విద్యార్థులకు మాత్రమే పుస్తకాలు, దుస్తులు, నోట్ పుస్తకాలు, స్టైఫండ్, తదితర వసతులు అందుతుండటంతో మిగిలిన 68 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలోని తరగతి గదులు, డార్మిటరీలలో విద్యార్థులు పుస్తకాలు, బట్టలతో పాటు బస చేసేందుకు రాత్రి వేళల్లో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం 200మంది విద్యార్థులకు మాత్రమే వసతిని అందించడంతో వారికి వండిన ఆహారంలోనే మిగిలిన 68మంది విద్యార్థులకు సరిచేస్తున్నారు.

పాఠశాలలోకి విషసర్పాలు..

పాఠశాల చుట్టూ పంట పొలాలు, పెద్ద కోరి గుంత ఉండటం వల్ల ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళల్లో విష పురుగులు అధికంగా సంచరిస్తున్నాయి. దీని వల్ల ప్రతిరోజు రాత్రివేళల్లో బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన వస్తోంది. క్రీడా స్థలం కపోవడంతో కోరి పక్కన భయంతో ఆటలు ఆడుకోవాల్సిన దుస్థితి దాపురించింది.

సీసీ కెమెరాల ఊసేలేదు..

పాఠశాలలో 268 మంది బాలికలున్న పాఠశాలలో ప్రభుత్వం సీసీ కెమెరాల ఏర్పాటు చేయకపోవడం విడ్డూరం. దీనివల్ల బాలికల రక్షణ ఇబ్బందిగా మారింది. పాఠశాల ఎర్రవల్లి కూడలికి దాదాపు 2 కిలో మీటర్ల దూరంలో ఉండటం వల్ల నిత్యం పోలీస్ పెట్రోలింగ్ లేకపోవడంతో పాఠశాలకు వెళ్లే రోడ్డుపై మద్యం బాబుల వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.



69మంది బాలికలు బసచేయాల్సిన డార్మిటరీ గది

డార్మిటరీల్లో బసకోసం పోరాటమే..

డార్మిటరీలలో విద్యార్థులు రాత్రి వేళల్లో బస చేసేందుకు నిత్యం ఇబ్బందులు తప్పడంలేదు. ప్రతి డార్మిటరీలో కేవలం 40మంది విద్యార్థులు మాత్రమే బస చేసేందుకు స్థలం ఉంటుంది. కానీ పరిమితికి మించి బాలికలు ఉండటం వల్ల ప్రతిరోజు ఇబ్బందులు పడుతున్నారు.

గతంలో కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులు పలుమార్లు పాఠశాలను సందర్శించి కోరిని పూడ్చేస్తామని హామీ ఇచ్చినా సమస్య నేటికీ తీరలేదు. ఇప్పటికైనా పాఠశాలలోని కోరిని పూడ్చి, ప్రహరీని నిర్మించి తమ సమస్యలను పరిష్కరించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

పాఠశాలలో తరగతుల వారీగా బాలికలు

క్రసం తరగతి	ఉండాల్సింది	ఉన్నవారు
1. 6వ తరగతి	40	54
2. 7వ తరగతి	40	63
3. 8వ తరగతి	40	69
4. 9వ తరగతి	40	47
5. 10వ తరగతి	40	35

అదనపు గదులు పెంచాలి..



పాఠశాలలో ప్రస్తుతం 5 తరగతి గదులు, 5 డార్మిటరీలు, 10 మరుగుదొడ్లు, 10 స్నానపు గదులు మాత్రమే ఉన్నాయి. పాఠశాలలో ఉండాల్సిన విద్యార్థుల కంటే 68మంది అదనంగా ఉన్నారు. దీనివల్ల ప్రతి రోజు ఉదయం స్నానం చేయాలన్నా కాల కృత్యాలు తీర్చుకోవాలన్నా గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. అధికారులు స్పందించి అదనపు గదులను ఏర్పాటు చేయాలి.

– లావణ్య, విద్యార్థిని, 8వ తరగతి

వసతులు అందరికి అందడం లేదు



పాఠశాలలో మొత్తం 268 మంది విద్యార్థులున్నారు. కానీ ప్రభుత్వం నుంచి కేవలం 200 మంది విద్యార్థులకే పుస్తకాలు, బట్టలు, నోట్ పుస్తకాలు అందుతున్నాయి. ప్రతి విద్యార్థికి రోజుకు రూ.34 చొప్పున 200 మందికే ఇస్తోంది. దీనివల్ల మిగిలిన విద్యార్థులకు అందులో నుంచే భోజనం అందించడం ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి విద్యార్థులందరికి ప్రభుత్వ వసతులను కల్పించాలి.

– జయలక్ష్మి, విద్యార్థిని, 7వ తరగతి

ఉన్నతాధికారులకు విన్నవించాం

పాఠశాలకు కాంపౌండ్ వాల్‌ను ఏర్పాటు చేసి ముందు ఉన్న కోరి గుంతను పూడ్చాలని పలుమార్లు ఉన్నతాధికారులతో పాటు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. పలుమా ర్లు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాఠశాలను సందర్శించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ సమస్య నేటికీ పరిష్కారం కాలేదు. పాఠశాలకు కేటాయించిన విద్యార్థుల కంటే 68మంది అదనంగా ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– ఆసియాబేగం, ప్రత్యేకాధికారి, ఎర్రవల్లి కేజీబీవీ

‘నీట్’ పేపర్ల లీకేజీపై విచారణ చేయాలి



మాట్లాడుతున్న ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్

గద్వాల అర్బన్: నీట్ పేపర్ల లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్ష పత్రాలు లీకేజీ చేసి 24లక్షల మంది జీవితాలతో ఎన్ఏటీ ఏజెన్సీ చెలగాటమాడిందన్నారు. దీనికి నీట్ చైర్మన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలని, నీట్ పరీక్ష రద్దు చేసి మళ్లీ తిరిగి నిర్వహించాలని, ఎన్ఏటీని రద్దు చేయాలని, నీట్ పరీక్ష నిర్వాహణ బాధ్యతలు రాష్ట్రానికి అప్పగించాలన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీమ్ పాష, యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రంగస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కృష్ణ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీష్, చందు ఉన్నారు.

అలంపూర్: నీట్ పరీక్షల నిర్వాహణలో అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆశన్నలు డిమాండ్ చేశారు. అలంపూర్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను బంద్ చేయించారు. దేశంలో చిన్నాభిన్నమైన విద్యా వ్యవస్థలను కాపాడి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు సిద్ధయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్, కార్తీక్, శ్రీను, రమేష్ ఆయా కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: దేశ వ్యాప్తంగా నీట్ లీకేజీపై తెలంగాణ వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిరణ్, రాజేష్, శివ, వెంకటేష్, దామోదర్, పాల్గొన్నారు.

మానవపాడు: కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని కేవీపీఎస్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎండీ సిరాజ్, మహేష్, భారత్, శివరాముడు, మాలిక్‌బాషా, భాస్కర్ పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బంద్‌కు మద్దతుగా మూసివేయించారు. మండలంలోని లింగన్‌వాయిలో విద్యార్థులు బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఈదన్న, విద్యార్థి సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో పోరాడాలి

గద్వాల అర్బన్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో దోపిడీ, పీడన లేని సమాజం కోసం పోరాడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేరు నర్సింహ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పేరు అంజి, సీఐటీయూ నాయకులు హనిమి, ఆంజనేయులు, వెంకటన్న, ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్ కుమార్, రాజు ఉన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా ఇందిర



అలంపూర్ రూరల్: మండలంలోని గ్రామాలను సమస్య రహిత గ్రామాలుగా మార్చాలని డీఈఓ, మండల ప్రత్యేకాధికారి ఇందిర అన్నారు. ఎంపీపీ పదవీ కాలం ముగియడంతో గురువారం అలంపూర్ మండల ప్రత్యేక అధికారిగా డీఈఓ ఇందిర బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆమె మా ట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రకళ, ఏపీఓ రాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

శాంతినగర్: నిరుద్యోగులను ముందస్తుగా అరెస్ట్ చేసినంత మాత్రాన ఉద్యమం ఆగదని పైపాడు వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం నిర్వహించనున్న నిరుద్యోగ మిలియన్ మార్చ్‌కు నిరుద్యోగులందరు తరలి వెళ్తారనే ఉద్దేశంతో నిరుద్యోగులను అరెస్ట్ చేయించడం హేయమైన చర్య అన్నారు. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేని ప్రభుత్వం నిరుద్యోగులు నిరసన తెలిపే హక్కును హరించాలనుకోవడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులందరు ఓట్లేసి గెలిపించినందుకు యువతకు బాగా బుద్ధిచెబుతున్నారని ఎద్దేవా చేశాడు. నిరుద్యోగుల ఉసురు తగలకముందే నిరుద్యోగ భృతి ప్రకటించాలని ఆయన డిమాండ్‌చేశాడు.

కార్మికుల వేతనాలు పెంచండి



మాట్లాడుతున్న వీవీ నరసింహ

అయిజ: కార్మికుల వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మొదటి నుంచి కార్మికులకు నష్టం వాటిల్లే విధానాలను అవలంభిస్తోందన్నారు. కనీస వేతనాలు, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా సౌకర్యాలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 10న జిల్లాలోని కలెక్టరేట్ ముందు నిరసన చేపట్టేందుకు అఖిల భారత సీఐటీయూ కమిటీ పిలుపునిచ్చిందన్నారు. కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు మల్లేశ్వరి, గిడ్డమ్మ, వీరేశమ్మ, గోవిందమ్మ, లక్ష్మి, సుజాత, జయమ్మ, పారిజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఐద్వా ఆధ్వర్యంలో సర్వే



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద

అయిజ: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఐద్వా నాయకురాలు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి మాట్లాడారు. ప్రతి రోజు 200 నుంచి 250 వరకు ఓపీలు వస్తున్నారని, పీహెచ్‌సీలో కేవలం 6 పడకలు మాత్రమే ఉండడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఆస్పత్రిలో మందుల కొరత తీవ్రంగా ఉందని, సరఫరా చేయాలని కోరారు. ఆస్పత్రిలో రెగ్యూలర్ డాక్టర్లు నియమించాలన్నారు. కార్యక్రమంలో కాంతమ్మ, లక్ష్మి, సుజాత, జయమ్మ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

‘పీసీసీని మాదిగలకు ఇవ్వాలి’



గట్టు: కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని దళిత సామాజిక వర్గంలోని మాదిగలకు కేటాయించాలని గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర నిరసన వ్యక్తం చేశారు. వివిధ గ్రామాలకు చెందిన దళితులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర నిరసన తెలిపారు. పీసీసీ పదవిని సంపత్‌కుమార్‌కు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపాల్, నర్సింహ, భాస్కర్, రాముడు, వంసత్, శ్రీను, వీరేష్, మోష, ప్రభు దాస్, గోపాల్ ఉన్నారు.

అంకితభావంతో పని చేయాలి



మానవపాడులో ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో ఎమ్మెల్యే విజయుడు, జెడ్పీచైర్‌పర్సన్ సరిత, ఎంపీపీ అశోక్‌రెడ్డి, ప్రాదేశిక సభ్యులు, అధికారులు

మానవపాడు: రాజకీయాల్లో రిటైర్మెంట్ ఉండదని ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే విజేయుడు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రాదేశిక సభ్యుల ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాసేవ చేస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేవాడు ప్రజాప్రతినిధి అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ సరిత మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేశామన్నారు. విధుల నిర్వహించే క్ర మంలో ఉద్యోగులను ఇబ్బందిపెట్టి ఉంటే మన్నించాలన్నారు. అనంతరం అధికారులు ప్రాదేశిక స భ్యులకు, ఎంపీపీ అశోక్‌రెడ్డి, మాజీ జెడ్పీచైర్‌పర్సన్ సరితకు పూలమాల శాలువాతో సత్కరించారు. వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపీపీ, వైస్ ఎంపీపీలకు ఘన సన్మానం

ధరూరు: ఎంపీపీ, వైస్ ఎంపీపీలతో పాటు ఎంపీటీసీల పదవీకాలం ముగియడంతో గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వారిని అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల కాలంలో ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు జవాబు దారిగా ఉన్న అధికారులందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు మంజుల, కో ఆప్షన్ మెంబర్ ఇస్మాయిల్, ఎండీ జబ్బార్, ఎంపీఓ కృష్ణమోహన్, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్, ధరూరు ఎంపీటీసీలు డీఆర్ శివలీల, దౌలన్న, జాకీర్, రాజారెడ్డి, డీఆర్ విజయ్‌కుమార్, అంజిరెడ్డి, వెంకటేష్ నాయుడు, షాకీర్, పాల్గొన్నారు.



ఎంపీపీ నజీమున్నీసా బేగం, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీలను సన్మానిస్తున్న అధికారులు

పిల్లలను పనులకు పంపొద్దు

రాజోళి: బడీడు పిల్లలను పనులకు పంపి వారి భవిష్యత్‌ను నాశనం చేయొద్దని జెడ్పీచైర్‌పర్సన్ సరిత అన్నారు. మండలంలోని ముండ్లదిన్నెలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ‘బడి పిల్లలను పని పిల్లలను కానివొద్దు’ అనే కార్యక్రమం పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. పనికి పంపితే వచ్చే డబ్బుతో ఒక పూట కడుపు నిండవచ్చని, బడికి పోతే భవిష్యత్ బంగారు మయం అవుతుందన్నారు. రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వం విద్యార్థులకు చదువు చెప్పిస్తోందని, వారికి బట్టలు, భోజనం ఏర్పాటు చేస్తోందిని, మెరుగైన విద్యను అందిస్తోందన్నారు. ప్రతి కుటుంబం తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ మండల కో ఆర్డినేటర్ జెడ్పీటీసీ సుగుణమ్మ, సింగిల్ విండో డైరెక్టర్ వెంకట్రామన్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు దస్తగిరి, మూగెన్న పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

పారిశుద్ధ్య పనుల పరిశీలన

అయిజ: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వివిధ కాలనీల ప్రజలు అధికారులను, పాలకులను కోరారు. గురువారం మున్సిపాలిటీలోని 8వ వార్డుకు సంబంధించిన భరత్ నగర్, గాజులపేట కాలనీలను మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల ప్రజలు వారి కాలనీల్లో నెలకొన్న సమస్యలను ఏకరవుపెట్టారు. డాక్టర్ రాంకుమంరా ఆస్పత్రి వెనక భాగంలో డ్రెయినేజీ నిండిపోయి మురుగు ముందుకు వెళ్లడంలేదని కాలనీ ప్రజలు వాపోయారు. ఎప్పటికప్పుడు మురుగు కాలువల్లో పూడికను వెలికి తీయాలని కోరారు. భరత్ నగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించకపోవడంతో వర్షాకాలం మనుషులు కూడా నడవలేని పరిస్థితి ఏర్పడుతుందని, సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. పట్టణ ప్రజలు ఇండ్ల ముందు నిర్మించిన డ్రైనేజీలపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని, కాలువలపై బండలు కూడా వేసుకోరాదని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంచార్జ్ వానిటరీ ఇన్స్‌పెక్టర్ లక్ష్మన్న, జూనియర్ అసిస్టెంట్‌లు విజయ్, పవన్, ప్రకాష్, లైన్‌మెన్‌లు, బిల్ కలెక్టర్లు, జవాన్లు, ఎలక్ట్రీషియన్‌లు పాల్గొన్నారు.



పారిశుద్ధ్యం పనులు పరిశీలిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

మెస్ కమిటీలను ఏర్పాటు చేయాలి

ఎర్రవల్లిచౌరస్తా: సాంఘీక సంక్షేమ వసతి గృహాల్లో మెస్ కమిటీలను ఏర్పాటు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. గురువారం ఎర్రవల్లి మండలం లోని వల్లూరు ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. వసతి గృహంలో వసతులను పరిశీలించి విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని తనిఖీ చేసి ఆయన మాట్లాడారు. వార్డెన్లు వసతి గృహాల్లో విద్యార్థులతో ఎలాంటి కమిటీలను ఏర్పాటు చేయలేదన్నారు. కమిటీలను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు అందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వసతి గృహాన్ని తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు

హాస్టళ్లలో వసతులు కల్పించాలని వినతి

గద్వాల అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లలో కనీస వసతులు కల్పించాలని ఏబీవీపీ విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు హాస్టళ్ల సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో బీసీ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికి హాస్టల్ సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నరేష్, గణేష్, పటేల్, అనిల్ తదితరులు ఉన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఉర్దూ పాఠశాలలో కస్తూర్బా తరగతులు

రాజోళి: మండల కేంద్రంలో ఉన్న ఉర్దూ పాఠశాలలోనే కస్తూర్బా గాంధీ పాఠశాలను తాత్కాలికంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు గురువారం పీఆర్ శాఖ అధికారులు పనులు ప్రారంభించారు. మండలంలో కస్తూర్బా పాఠశాల భవనం లేకపోవడంతో, వడ్డేపల్లిలోని కస్తూర్బా గాంధీ భవనంలోనే తరగతులు నిర్వహించే వారు. కాగా అక్కడ రెండు మండలాల విద్యార్థులు వసతుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడడంతో విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా అధికారులకు సమస్యను విన్నవించారు. మండల కేంద్రంలో భవనం నిర్మాణం పూర్తయ్యేదాకా, ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. దీంతో పీఆర్ అధికారులు గురువారం అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా పనులను మొదలుపెట్టారు. ఉర్దూ పాఠశాలలో 8 గదులు ఉండటంతో 3 గదులు ఉర్దూ పాఠశాల విద్యార్థులకు, 5 గదులు కస్తూర్బా విద్యార్థులకు కేటాయించారు. ఇక్కడ టాయిలెట్స్ సమస్య ఉండటంతో టాయిలెట్స్, సంపు, తాగునీరు, సెప్టిక్ ట్యాంక్ ఇతర సౌకర్యాలను కల్పించేందుకు రూ.7 లక్షలతో పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో పీఆర్ డీఈ ఆంజనేయులు, ఏఈ లక్ష్మీనారాయణ రెడ్డి, దస్తగిరి తదితరులు పనులు పరిశీలించారు. వేగంగా పనులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే విద్యార్థుల పెట్టెలు, ఇతర ఫర్నీచర్‌ను మండల కేంద్రానికి తరలిస్తున్నారు.



వడ్డేపల్లి నుంచి ఫర్నీచర్ తరలిస్తున్న ట్రాక్టర్